# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 139 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 15 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## శుభకార్యానికి వెళ్లొస్తూ..
# మృత్యు ఒడిలోకి...

**కృష్ణా నదిలో పడవ బోల్తా : నలుగురు దుర్మరణం ఆరుగుర్ని రక్షించిన గ్రామస్తులు**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** ఎపిలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆదివారం జిల్లాలోని కోనూరు గ్రామ సమీపంలో కృష్ణా నదిలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు నదిలో గల్లంతవగా, స్థానికులు,

మిగతా2లో...

## వర్షం వస్తే రోడ్లపై
# ఉండాల్సిందే...
## - అవసరమైతే నేనూ వస్తా...

**ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

**జూన్ 1న చెప్పినా... నిర్లక్ష్యంగా వ్యవహరించారు**

**మరోసారి అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు**

**ఇప్పటికైనా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధం కావాలి**

**విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలని ఆదేశం**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** 'వర్షాకాలం నేపథ్యంలో ఈనెల 1న నేను సమీక్ష నిర్వహించా. అనేక సూచనలు చేశా. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాంతో ఈనెల 9న వర్షం వచ్చిన సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వ యం లోపించింది. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి...' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. వర్షాలు వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు అందరూ రోడ్లపైనే ఉండాలని ఆదేశించారు. అవసరమైతే తానూ వస్తానని తెలిపారు. వర్షాలు పడినప్పుడు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిగతా2లో...

## నన్ను తరిమి కొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద
# పుట్టలేదు : కిషన్ రెడ్డి



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** మెట్రో రైల్‌కి కేంద్రం నిధులు ఇస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మెట్రోకి నిధులు ఇవ్వకపోతే మేము రాజీనామా చేస్తామని, హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నన్ను తరిమికొడతానని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, నేను బిఆర్ఎస్ కార్యకర్తని కాదని.. బిజెపి కార్యకర్తనని తెలియజేశారు. నన్ను అడ్డుకునే

మిగతా2లో...

## సింగరేణిపై డేగ కన్ను వేస్తే
# ఊరుకోం..

● కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం రాజకీయ స్వార్థం కోసం ప్రతిష్టను దెబ్బతీయొద్దు ● దోపిడీదారులకు సింగరేణిలో ఎలాంటి స్థానం లేదు : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**నస్పూర్,మన జనప్రగతి జూన్ 14:** సింగరేణి కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ స్వార్థం కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను మంత్రి శ్రీధర్‌బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, సింగరేణి

మిగతా2లో...

## రెండున్నరేండ్ల రేవంత్ రెడ్డి పాలన
# అట్టర్ ఫ్లాప్

**అక్రమాలను అధిష్టానానికి చెప్పినందుకే మీనాక్షిపై కేసు**

**త్వరలో ఖైరతాబాద్ అసెంబ్లీకి ఉప ఎన్నిక : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రెండున్నరేండ్ల పాలన అట్టర్ ఫ్లాపని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చేస్తున్న అవినీతి, అక్రమా లను పార్టీ అధిష్టానానికి చెప్పినందుకే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి

మిగతా2లో...



## తెలంగాణలో రాబోవు
# 3,4 రోజులు వర్షాలు..

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:**రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే... కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం 3040 కి.మీ ఈదురుగాలులు వీచే ఛాన్స్.. 18, 19.20 మిగతా2లో...

## హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం
# 'మూసీ'

**నగర ఆత్మ 'సాలార్ జంగ్ మ్యూజియం': 75వ వార్షికోత్సవంలో భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** ఏదైనా ఒక నగరం కొన్ని సంస్థలను నిర్మిస్తే, మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సాలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ ఆత్మకు ప్రతిరూపమని ఆయన వ్యాఖ్యానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియం 75వ వసంతాల వేడుకలతోపాటు, మీర్ యూసుఫ్ అలీఖాన్ (సలార్ జంగ్-3) 137వ జయంతి ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని ఒడిసిపట్టిన మహోన్నత వ్యక్తి సాలార్ జంగ్-3 అని గుర్తు చేశారు. 'సాధారణంగా మనం మన కళ్ళజోడు, మొబైల్ ఫోన్, కార్ కీస్ లాంటి చిన్న వస్తువులనే మర్చిపోతుంటాం. కానీ సాలార్ జంగ్-3 ఏకంగా ప్రపంచ నాగరికతలనే భద్రపరిచారు. 43 వేల కళాఖండాలను సేకరించారు. అదీ కళలపై ఆయనకున్న అపారమైన భక్తి. ప్రపంచంలోని అరుదైన సౌందర్యాన్ని, చరిత్రను తన సొంత నిధుల నుంచి సేకరించారు. వాటన్నింటినీ ప్రజల ఆస్తిగా మార్చారు. ఈ మ్యూజియంలో హిందువుల కాంస్య విగ్రహాలు, పవిత్ర ఖురాన్ ప్రతిమలు, క్రైస్తవ మడోన్నా శిల్పాలు, బౌద్ధ కళాఖండాలు ఒకే చోట కొలువై ఉన్నాయి.విష్ణుమూర్తి దశావతారాలు, ఖురాన్ శ్లోకాలు కలిసి ఉన్న ఆచార వస్తువులు ఇక్కడి ప్రత్యేకత. ఇది లౌకికత్వానికి సజీవ సాక్ష్యం. ఇదే దక్కన్ గంగా-జమునా తెహజీబ్' అని గుర్తు చేశారు. మ్యూజియం పక్కనే ప్రవహించే మూసీ నది అంటే హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం అని

మిగతా2లో...

## సిఎం రేవంత్
# కీలక నిర్ణయం..

**విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్**

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో యూనిఫాంతో పాటు తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. గతంలో బిసి గురుకులాల్లోని విద్యార్థులకు మాత్రమే బూట్లు ఇచ్చేవారు. ఈ దఫా అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు బూట్లను రాష్ట్ర ప్రభుత్వం



మిగతా2లో...

## రేవంత్ సర్కార్ సహకరిస్తున్నందునే కేంద్రం నుంచి నిధులు: బండి


2లో

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
15 - 06 - 2026

# వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిందే...

(మొదటి పేజీ తరువాయి)

వర్షాకాల సన్నద్ధతపై ఆదివారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఈనెల 9న ఏర్పడిన పరిస్థితులపై ఆరా తీశారు. సైబరాబాద్ తోపాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. ఆ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం పడిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తానూ రోడ్డుపైకి వస్తానని చెప్పారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.

**విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలి**

వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. యూరియా స్టాక్ , పంపిణీ కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**తాగునీరు కలుషితం కాకుండా చూడాలి**

వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.

గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.

# సింగరేణిపై డేగ కన్ను వేస్తే ఊరుకోం..

(మొదటి పేజీ తరువాయి)

సీ అండ్ ఎండీ బుద్ధ ప్రకాష్‌తో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపెన్ హౌస్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. మైన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు అక్కడ అమలవుతున్న భద్రతా ప్రమాణాలు, బొగ్గు రవాణాకు సంబంధిం చిన లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నా రు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ .. కార్మికుల శ్రమను అవమానిస్తే సహించేది లేదన్నారు. సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో ఏది నిజం, ఏది అబద్ధమనే వాస్తవాలను ప్రజలముందుకు తీసుకురావాలనే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాల కోసమే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజాప్రభుత్వం చెప్పేది కేవలం నిజాలు మాత్రమేనని, ఆ నిజాన్ని ప్రజల ముందుంచడమే తమ బాధ్యతని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి లో కార్మికుల చెమట, కఠోర శ్రమ దాగి ఉన్నాయని, వారి ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేసేలా ఎవరు వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని అన్నారు. సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, యావత్ తెలంగాణ ప్రజల ఆస్తి అని అన్నారు. ఇక్కడి వనరులు, ఈ వ్యవస్థ, ఈ శక్తి అంతా ప్రజల నుంచి వచ్చిందేనని తెలిపారు. భవిష్యత్తులోనూ సింగరేణి సంస్థ అత్యంత పారదర్శకంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ ఓసీ మైన్ నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం మరో 28 సంవత్సరాలపాటు ఇక్కడ బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. సింగరేణి సంస్థలో జరుగుతున్న ప్రతి ప్రక్రియ అత్యంత ఆధునికంగా, కంప్యూటరైజ్డ్ విధానంలో పారదర్శకంగా సాగుతోందని అన్నారు. కార్మికుల ఆరోగ్యం, పిల్లల చదువు, వారి భవిష్యత్తుపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణప్రాంతాల్లో క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోందన్న నివేదికల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందించేం దుకు వీలుగా పూర్తి ఆధునిక పరికరాలతో కూడిన 'క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను' మంజూరు చేస్తున్నా మన్నారు. ఈ బస్సులు ఊరూరా తిరిగి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తిస్తే త్వరితగతిన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశ పెట్టామన్నారు. కార్మికుల పిల్లల ఉన్నత ఆశయాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో మేళవించి సింగరేణిని ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేశారు.

# రెండున్నరేండ్ల రేవంత్ రెడ్డి పాలన అట్టర్ ఫ్లాప్

(మొదటి పేజీ తరువాయి)

మీనాక్షి నటరాజన్‌పై కేసు పెట్టించారని ఆరోపించారు. కాంగ్రెస్ లో ఉన్న అతి కొద్ది మంది నిజాయితీ పరుల్లో ఆమె ఒకరని తెలిపారు. అలాంటి వ్యక్తిపై కుట్ర చేశారని పేర్కొన్నారు. సొంత పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నానని ప్రకటించిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమేనని ఎద్దేవా చేశారు. ప్రజలకు అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాగ్రెస్ ప్రభుత్వం అందరినీ మోసం చేస్తోందని విమర్శించారు. ఐదేండ్లలో సగం కాలం ముగిసినా ఒక్క హామీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు. నిరుద్యోగ భృతి రూ. 4 వేలు ఎక్కడిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని ఇచ్చిన హామీ ఎక్కడ నెరవేరిందో నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరారు. ఇచ్చిన హామీల లెక్క ప్రకారం ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ. 1.25 లక్షలు బాకీ ఉందని గుర్తు చేశారు. ఖైరతాబాద్‌లో రెండుసార్లు గులాబీ జెండా ఎగురవేశామనీ, మూడోసారి కూడా సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలను మోసం చేసి రేవంత్ పక్కన కూర్చున్న దానం నాగేందర్ వల్ల త్వరలో ఉప ఎన్నిక రావడం ఖాయమని పేర్కొన్నారు. ప్రతి ఓటు విలువైనదనీ, జూబ్లీహిల్స్‌లో లాగా దొంగ ఓట్లతో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని హెచ్చరించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఓటును జాగ్రత్తగా గమనించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 31 వరకు జరిగే సర్ ప్రక్రియలో ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ బాధ్యతగా పనిచేయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జనగణన, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేటీఆర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**మహబూబ్ నగర్ ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొడతారు**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపెట్టి, కమిషన్ల, కాంట్రాక్టుల కోసం లక్షల ఎకరాల పంటకు నీరివ్వకుండా ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ ఏర్పాటుకు ముందు వలసల జిల్లాగా ఉండేదనీ, అలాంటి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపామని గుర్తు చేశారు. ప్రజల్లో ఉన్న సానుకూలతను పార్టీకి అనుకూలంగా మలుచుకోవాల్సిన అవసరం ఉందనీ, ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టాలని నేతలను ఆదేశించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆసక్తికర దృశ్యం కనిపించింది. లండన్ తోపాట పలు ఉన్నత విద్యాసంస్థల్లో చేరనున్న నలుగురు యువతులు రాజకీయాలపై ఆసక్తితో కేటీఆర్‌ను కలిశారు. రాజకీయనేతలుగా ఎదగాలని తాము నిర్ణయించుకున్నామనీ, కలసి పనిచేస్తామని వారు తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నదే తన అభిమతమనీ, వారి ప్రయాణంలో అండగా ఉంటామని ఈ సందర్భంగా కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం 'మూసీ'

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఎన్నో ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని ప్రక్షాళన చేసి, లండన్ లోని థేమ్స్, పారిస్ లోని సీన్ నది తరహాలో అంతర్జాతీయ స్థాయి రివర్ ఫ్రంట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాలార్ జంగ్ మ్యూజియం కేవలం ఒక ఒంటరి భవనంగా కాకుండా అభివృద్ధి చెందిన మూసీ రివర్ ఫ్రంట్‌కు ఒక సాంస్కృతిక కిరీటంగా మారబోతోందన్నారు. పర్యాటకులు నది గుండా ప్రయాణిస్తూ, ఇక్కడి వారసత్వ వీధుల్లో నడుస్తూ, చారిత్రక కళాఖండాలను వీక్షించేలా ఒక అద్భుతమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ అంటే కేవలం చార్మినార్ మాత్రమే కాదు.. సైబర్ టవర్స్ నగరం కూడా అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అంతే వేగంగా ఎదుగుతోందన్నారు. బిర్యానీతోపాటు బయోటెక్నాలజీ, ఐటీ, ఫార్మా రంగాల్లో గ్లోబల్ పవర్‌హౌస్‌గా ఉన్నామని తెలిపారు. చార్మినార్, గోల్కొండ, కుతుబ్ షాహీ సమాధులు, చౌమహల్లా, ఫలక్‌నుమా ప్యాలెస్‌లతో కూడిన ఓల్డ్ సిటీ హెరిటేజ్ సర్క్యూట్‌ను సలార్ జంగ్ మ్యూజియంతో అనుసంధానిస్తామన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు, నైట్ టూరిజం, తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో గైడెడ్ వాక్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వారసత్వం అనేది కేవలం గర్వపడటానికే కాదు.. స్థానిక గైడ్‌లు, కళాకారులు, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి జీవనోపాధి కల్పించడానికి ఉపయోగపడాలని చెప్పా రు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్ వరకు ప్రతి విద్యార్థి ఈ మ్యూజియాన్ని సందర్శించి 'ఇది నా ఆస్తి'అనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలన్నారు. హైదరాబాద్‌కు ఐటీ, బిజినెస్ పనుల మీద వచ్చే గ్లోబల్ ఇన్వెస్టర్లు కేవలం బోర్డ్‌రూమ్‌లకే పరిమితం కాకుండా.. కనీసం ఒక రోజు సాలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించి, చార్మినార్ వద్ద ఇరానీ చాయ్ తాగి ఇక్కడి సంస్కృతిని ఆస్వాదించాలని సూచించారు. మన బిర్యానీ, హలీమ్, చాయ్ కేవలం ఆహార పదార్థాలు కావు.. తెలంగాణ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలన్నారు, ఈ 75 ఏండ్ల ప్రయాణంలో మ్యూజియాన్ని కాపాడుకుంటూ వస్తున్న క్యూరేటర్లు, కన్సర్వేటర్లు, సెక్యూరిటీ, క్లీనర్లు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏదైనా ఒక నగరం కొన్ని సంస్థలను నిర్మిస్తే, మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కానీ సాలార్ జంగ్-3 ఏకంగా ప్రపంచ నాగరికతలనే భద్రపరిచారు. 43 వేల డాలను సేకరించారు. అదీ కళలపై ఆయనకున్న అపారమైన భక్తి. ప్రపంచంలోని అరుదైన సౌందర్యాన్ని, చరిత్రను తన సొంత నిధుల నుంచి సేకరించారు. వాటన్నింటినీ ప్రజల ఆస్తిగా మార్చారు. ఇదే దక్కన్ గంగా-జమునా తెహజీబ్' అని గుర్తు చేశారు. మ్యూజియం పక్కనే ప్రవహించే మూసీ నది అంటే హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం అని అన్నారు. ఎన్నో ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని ప్రక్షాళన చేసి, లండన్ లోని థేమ్స్, పారిస్ లోని సీన్ నది తరహాలో అంతర్జాతీయ స్థాయి రివర్ ఫ్రంట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాలార్ జంగ్ మ్యూజియం కేవలం ఒక ఒంటరి భవనంగా కాకుండా అభివృద్ధి చెందిన మూసీ రివర్ ఫ్రంట్‌కు ఒక సాంస్కృతిక కిరీటంగా మారబోతోందన్నారు.

# శుభకార్యానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడిలోకి...

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు జరిపిన గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతి చెందిన వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా అధికారులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పది మంది బంధువులు కోనూరులో జరిగే ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు పడవపై కృష్ణానది దాటి వెళ్లారు. వేడుక ముగిసిన తరువాత అదే పడవపై తిరుగు ప్రయాణమయ్యా రు. నది మధ్యలోకి రాగానే ఒక్కసారిగా పడవ నియంత్రణ కోల్పోయి నీటిలో బోల్తా పడింది. అందులో ఉన్న వారంతా నీట మునిగిపో యారు. ఇది గమనించిన స్థానిక మత్స్యకారులు, గ్రామస్థులు వెంటనే నదిలోకి దూకి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో కలిసి మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నలుగురి మృతదేహాలు వెలికితీశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు కళ్లముందే నదిలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో వారి బాధ వర్ణణాతీతం.

# నన్ను తరిమి కొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదు : కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దమ్ము కాంగ్రెస్ కు ఉందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. నన్ను తరిమి కొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద పుట్టలేదని, రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టారని అన్నారు. బిజెపి 2028లో ఆట ముగిస్తుందని, కాంగ్రెస్, బిజెపి ఒక్కటేనని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో రాబోవు 3,4 రోజులు వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

తేదీలలో భారీ వర్షాలు... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల నెమ్మదిగా కదులుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాగల 3,4 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుం చి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం విడుదల చేసిన నివేదిక ప్రకారం నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం హర్నై, సోలాపూర్ మీదుగా తెలంగాణలోని హైదరా బాద్, భద్రాద్రి కొత్తగూడెం, అటుపై కళింగపట్నం, పారాదీప్, ముజఫర్‌పూర్ మీదుగా కొనసాగుతోంది. రాబోయే 4 నుంచి 5 రోజులలో తెలం గాణలోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత ముం దుకు సాగడానికి పరి స్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 18, 19,20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మరో 3 రోజులపాటు మార్పు ఉండదని పేర్కొంది. సోమవారం కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని 30-40 కి.మీ. వేగంతో ఈదు రుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. బలహీ నపడిన ఆవర్తనం ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు, సముద్ర మట్టానికి 3.1 నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తు మధ్య ఒక ద్రోణి విస్త రించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోకి తగినంత తేమ గాలులు వీస్తున్నాయి. మరోవైపు, దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టా నికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలహీనపడినట్లు వాతావరణ కేంద్రం విశ్లేషిం చింది. ఈ వాతావరణ మా ర్పుల నేపథ్యం లో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలలో రానున్న మూడు రోజులలో పెద్దగా మార్పులు ఏమీ ఉండవని, ఎండల తీవ్రత తగ్గి సాధారణ ఉష్ణోగ్రతలు నమోద వుతా యని పేర్కొన్నారు. గంటకు 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వర్ష సూచనతో పాటు వాతావరణ కేంద్రం రాష్ట్ర ప్రజలకు పలు హెచ్చరి కలు జారీ చేసింది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్య ంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ప్రయాణికులు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రేవంత్ సర్కార్ సహకరిస్తున్నందునే కేంద్రం నుంచి నిధులు: బండి

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 14:** రెండు చేతులు కలిస్తే చప్పట్లు కేంద్రం, రాష్ట్రాలు కలిస్తే అభివృద్ధి అని కేంద్రమంత్రి బండిసంజయ్ తెలిపారు. గత ప్రభుత్వ మూర్ఖత్వంతో తెలంగాణ నష్టపోయిందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బండిసంజయ్ పర్యటించారు. ఆది శ్రీనివాస్ తో కలిసి వేములవాడ సిరికొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ సహకరిస్తున్నందునే కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయని, రోడ్ కోసమే రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలియజేశారు. గ్రామాలను మండలాలు, నియోజక వర్గాలకు కనెక్ట్ చేసేలా రోడ్ల నిర్మాణం జరుగుతుందని, ఏడేళ్లలో రూ. 22 వేల కోట్ల నిధులు తెచ్చామని, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ సెగ్మెంట్ ను అభివృద్ధి చేస్తున్నామని బండి సంజయ్ పేర్కొన్నారు.

# సిఎం రేవంత్ కీలక నిర్ణయం..

(మొదటి పేజీ తరువాయి)

అందజేస్తోంది. అలాగే బిసి,ఎస్సి, ఎస్‌టిమైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు (నలుపు, తెలుపు -సాక్సులతో), బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్‌తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్‌లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్నది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఇంటర్ విద్యార్థులకు బ్యాగు, బెల్టు, టై, బూట్లు, సాక్సులు గత ప్రభుత్వాలు ఇప్పటివరకు ప్రభుత్వాలు పాఠశాలలకే పెద్దపీట వేశాయి. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులపైనా ప్రత్యేకంగా దృష్టిసారించింది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగు, బెల్టు, టై, నల్లటి బూట్లు, సాక్సులు అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా సంస్థలకు చేరాయి. తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తి కానుంది. విద్యార్థులకు యూనిఫాంతో పాటు అందజేసే బూట్లు, సాక్సులు, టైలు, బెల్టులు, గురకుల్లాలోని విద్యార్థులకు అందజేసే దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్లు ప్రతి ఒక్కటి నాణ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టెండర్లను పిలిచింది. మిగిలిన ఆర్డర్లను టిజిఎస్‌సిఒ, టిజిఎల్‌ఐపిసి, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ టిజిటిపిసిలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తున్నది రూ.687.78 కోట్లు మాత్రమే.

# సర్ పై యువతకు శిక్షణ కార్యక్రమం



**కడప మన జనప్రగతి జూన్ 14:-** కేంద్ర ప్రభుత్వం ఓటర్ల సవరణ జాబితా అయిన సరు ను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందని కడప కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. ఆదివారం కాగితాల పెంట కాంగ్రెస్ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ2002 ఓటర్ల జాబితాను ధ్రువీకరిస్తున్న కార్యక్రమం చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం పై రవీంద్ర నగర్ లోని రాజ్ ఫంక్షన్ హాల్ లో యువతకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ ట్రైనింగ్ ఇస్తామని తెలిపారు .ఆసక్తి కలిగిన యువకులందరూ ఈ కార్యక్రమం పాల్గొనాలని కోరారు. ఈ ప్రోగ్రాం లో సర్ఛ్ ,పిడిఎఫ్, ద్వారా ఏ విధంగా ఓటర్లను గుర్తించాలి, తొలగించిన ఓట్లను ఎలా చేర్చాలి అనే కార్యక్రమాన్ని దగ్గరుండి నేర్పిస్తామని వీటి ద్వారా యువకులు తమ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు సహాయ సహకారాలు అందించవచ్చని వారు తెలిపారు .ఎస్ ఐ ఆర్ పై సరైన అవగాహన లేక పశ్చిమబెంగాల్, బీహార్ ,తమిళనాడు, కేరళ పాండిచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి అనుకూలంగా ఓట్లు పడ్డాయని తెలిపారు. ఓట్లు ద్వారా రాజ్యాంగ హక్కులు దక్కించుకోవచ్చని ప్రజలకు పిలుపునిచ్చారు రాష్ట్రంలో బిజెపి, టిడిపి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్ళు చెప్పేది ఒకటి చేసేదొకటిని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ తమ స్వలాభానికి వాడుకుంటున్నారని తెలిపారు .కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదల పక్షాన, బాధితులకు అండగా నిలబడుతుందని సమాజ శ్రేయస్సు పాటుపడుతుందని అన్నారు ఈ యొక్క సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ ,కాజురుల్లా ,ఖాజీ, సాదిక్, అన్వర్ ,షేక్ అన్వర్ ,సర్దార్ భాష ,సిద్ధిక్, సుబ్రహ్మణ్యం, అమితా ఖాన్, జమీల్ ,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్లంపల్లి చెరువు కట్ట నూతన రోడ్డు ప్రారంభం



**కడప మన జనప్రగతి జూన్ 14:-** కడప నగరంలోని 15వ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన పుట్లంపల్లి చెరువు కట్ట రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం డివిజన్ ఇంచార్జి , పాలకొండ చైర్మన్ బుర్ర రెడ్డయ్య యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి పాల్గొని, నూతన రహదారిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రోడ్డును వాకర్స్కు అనుకూలంగా సుందరీకరణ చేస్తామని రోడ్డు ఇరుపక్కల లైటింగ్స్ను కూర్చోడానికి బెంచెస్ కూడా ఏర్పాటు చేసి ,అక్కడ అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.నగరంలో ప్రజల రవాణా సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు, మెరుగైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి ,రంజిత్, మనోజ్ కుమార్ రెడ్డి ,సుబ్బారెడ్డి ,చిట్టి బోయిన సుబ్బరాయుడు యాదవ్, బాలకొండయ్య, వెంకటసుబ్బయ్య ,రాయుడు, జయరామిరెడ్డి ,వరప్రసాద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో ఏజెంట్లదే కీలకపాత్ర



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 14: –** ఓటర్ల జాబితా సవరణలో ఏజెంట్లదే కీలకపాత్ర అని మండల తెదేపా కన్వీనర్ రామముని రెడ్డి అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం వేంపల్లి పట్టణ తెదేపా క్లస్టర్ ఇంచార్జి ఇనాయతుల్లా ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఈనెల 15 నుంచి జూలై 7 వరకు అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక విఆర్ఓ ను ఇన్చార్జిగా నియమించారని, వారితో ఆయా పోలింగ్ కేంద్రాల తెదేపా ఇన్చార్జిలు కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ఓటు విలువైనదని, ఈ సవరణ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఎక్కడ ఏ ఒక్క ఓటును అజాగ్రత్త చేయొద్దన్నారు . కార్యక్రమంలో మండల తెదేపా ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, వేంపల్లి తెదేపా పట్టణ శాఖ అధ్యక్షుడు నామ వేమకుమార్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, టిడిపి యూనిట్ సభ్యులు జబీబుల్లా,డక్కా రమేష్, టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాష, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా, బక్కన్న గారి పల్లె గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రక్త దానము ద్వార ప్రాణాలాను కాపాడాలి

## - అన్నమయ్య జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శ్యాకాధికారి రాధిక





**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 14:-** రక్త దానము ద్వార ప్రాణాలాను కాపాడాలనీఅన్నమయ్య జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శ్యాకాధికారి రాధిక పిలుపునిచారు--ప్రజా చైతన్య సేవా సంఘం రక్త దాన శిబిరం" ఆదివారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ప్రజా చైతన్య సేవా సంఘం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దీప రక్తనిధి వారి సహకారంతో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క క్యాంప్ లో రక్త దాతల సహాయం తో బ్లడ్ శ్యాంపులస్ సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది రక్తం నష్టపోయి ప్రాణాలు కోల్పోతున్నారు అని, ప్రసవ సమయం లో కూడా చాలా మంది రక్తం లేక ఇబ్బందులు పడే సందర్భములు చాలా వునాయి అని ,అధే విధంగ ఆపరేషన్ అవసరం అయ్యనప్పుడు మరియు ఇదే కారణాలతో హాస్పిటల్ కి వచ్చేవారికి రక్తం కొరత లేకుండా వుండేటట్లు ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా బావించి రక్త దానము చేయాలి అని అన్నమయ్య జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ ణతీ. ల్ రాధికా మరియు పి సి యస్ యస్ ప్రాజెక్ట్ డైరెక్టర్: జి.చెన్నారెడ్డి , సూచించారు. ఈ కార్యక్రమం నందు ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి మరియు వారితోటి సిబంధి పాల్గొనడం జరిగింది.

# అరటి భలేతీపి.. రైతు కళ్లలో ఆనందం

**మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు.**

**తోటల వద్దే టన్ను రూ 25 వేలతో కొనుగోలు**



**లింగాల మన జనప్రగతి జూన్ 14-** అరటి పంట సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే వైఎస్సార్ కడప జిల్లా రైతులకు ఈ సీజన్ భారీ లాభాలను తెచ్చిపెడుతోంది. మార్కెట్‌లో అరటి ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న కొందరు అరటి రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో సరైన ధర లేక, పెట్టిన పెట్టుబడులు కూడా రాక నష్టాల్లో మునిగిపోయిన కడప అరటి రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరలు కొండంత అండగా నిలిచాయి. 'అరటి భలేతీపి' అంటూ వ్యాపారులు కడప తోటల వైపు పరుగులు తీస్తుండటంతో ఇక్కడి మార్కెట్ కళకళలాడుతోంది అరటి సాగు చేసిన అన్నదాతకు మే, జూన్ మాసాలుకలిసివచ్చాయి. మార్కెట్‌లో గత రెండు మాసాలుగా అరటి ధరలు భారీగా పెరగడముతో రైతు కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఏప్రిల్ మాసం వరకు ఆశించిన ధరలు లేక, పెట్టిన పెట్టుబడులు కూడా రాక నష్టాల్లో మునిగిపోయిన అరటి రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరలు కొండంత అండగా నిలిచాయి. 'అరటి భలేతీపి' అంటూ అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కొనుగోలు చేస్తుండటంతో తోటల వద్దే వ్యాపారం జోరుగా సాగుతోంది. **రికార్డు స్థాయిలో ధరలు..** గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది అరటి గెలల ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. గతంలో రైతులు గెలలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకోవడానికి ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు డిమాండ్ పెరగడంతో వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. పెరిగిన టన్ను ధర: గతంలో టన్ను అరటి ధర కనిష్టంగా 2000రూపాయలు గరిష్టంగా 8000 రూపాయలు ఉండేది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యతను బట్టి టన్ను ధర 20 వేల రూపాయల నుంచి 28వేల రూపాయల వరకు ఉండడం వల్ల రైతుకు గరిష్టంగా లాభాలను తెచ్చిపెడుతోంది. **పెట్టుబడులు పోను మంచి లాభాలు:** ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగినప్పటికీ.. ప్రస్తుత మార్కెట్ రేటు వల్ల రైతులకు అన్ని ఖర్చులు పోను ఆశించిన దానికంటే ఎక్కువ నికర లాభం దక్కుతోంది. **కలిసివచ్చిన డిమాండ్** ఇతర ప్రాంతాల నుండి దిగుమతులు తగ్గడం, ఈనెల 4 , 5 తేదీలలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దులతోపాటు పలు ప్రాంతాల్లో వీచిన రాకాసి గాలులకు భారీగా అరటిపంట నేలకొరిగినట్లు తెలుస్తోంది. దీంతో అరటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. వాతావరణం అనుకూలించి తోటల్లో నాణ్యమైన దిగుబడి వచ్చిన రైతులకు ఈ ధరల పెరుగుదల పెద్ద వరంగా మారడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **అన్నదాతల హర్షం** చాలా నెలల తర్వాత అరటి పంటకు మంచి ధర దక్కింది. గతంలో పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పులపాలయ్యాం. కానీ ఈసారి వచ్చిన ధరలతో అప్పులు తీరడమే కాకుండా నాలుగు పైసలు వెనకేసుకునే అవకాశం కలిగింది అని పలువురు అరటి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ధరలు మరికొన్ని వారాల పాటు కొనసాగితే ఈ ఏడాది కొందరు అరటి రైతులకు మంచి ఆర్థిక పురోగతి లభిస్తుంది.ఖర్చులు పోను మంచి లాభాలు: ఎరువులు, రవాణా, కూలీల ఖర్చులు పెరిగినప్పటికీ.. ప్రస్తుత రేటు వల్ల రైతులకు ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పైగా నికర లాభం దక్కుతోంది. **నష్టాల నుంచి గట్టెక్కిన వేళ..** గతేడాది, ఈ ఏడాది మార్చి ఏప్రిల్ మాసాలలో అకాల వర్షాలు, గాలివానల వల్ల తోటలు విరిగిపడి ఈ ప్రాంత రైతులు కోట్లాది రూపాయల నష్టాన్ని చవిచూశారు. ఆ అప్పుల నుంచి ఈ ఏడాది వచ్చిన ధరలు తమను గట్టెక్కిస్తున్నాయని కొందరు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వాతావరణం కొంత అనుకూలించడం, నాణ్యమైన దిగుబడి రావడం, అదే సమయంలో మార్కెట్‌లో కొరత ఉండటం జిల్లా రైతులకు పెద్ద వరంగా మారింది.

# సీనియర్లను అణగదొక్కే ధోరణి మానుకోవాలి

**జగన్‌మోహన్‌రాజు వ్యవహారశైలిపై టీడీపీ సీనియర్ నేతల ఆగ్రహం**

**పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక**



**ఒంటిమిట్ట, మన జనప్రగతి జూన్ 14:-** ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె పంచాయతీ పరిధిలోని అచ్చంపేట గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఉన్నం కిరణ్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విందు సమావేశంలో రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు నియోజకవర్గ పార్టీ వ్యవహారాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పలు అంశాలపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడిన సీనియర్ నాయకులను పక్కనపెట్టి, ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని వారు ఆరోపించారు. పదవులు, పనుల కేటాయింపులో పారదర్శకత లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన కొందరు నాయకులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ, మట్టి, ఇసుక తదితర కాంట్రాక్టు పనులు అప్పగించడం వల్ల పార్టీ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కోసం పోరాటం చేయని వ్యక్తులు నేడు సీనియర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం విచారకరమన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడటం సరైన విధానం కాదని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఇసుక మాఫియా ప్రభావం పెరిగిందని, దీనిపై ప్రశ్నించిన సీనియర్ నాయకులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. పార్టీకి సంబంధం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్ల కార్యకర్తల్లో అయోమయం నెలకొందని అన్నారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం పాత కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. మంటపంపల్లెలో శాంతియుతంగా జరుగుతున్న సమావేశంలో కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి ఉద్రిక్తత సృష్టించారని ఆరోపిస్తూ, ఇటువంటి పరిణామాలు పార్టీకి శుభసూచకం కాదన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై త్వరలో భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతినకుండా అధిష్టానం వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ కల్లు గీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, ఉన్నం కిరణ్‌స్వామి, మందపల్లి శ్రీనివాసులు, భగవాన్ సహాయరెడ్డి, లేబాక లక్ష్మీనరసయ్య, ప్రతాపరెడ్డి, మామిళ్ల ఈశ్వరయ్య, పామూరు సుబ్రహ్మణ్యం, గంగపేరు కృష్ణారెడ్డి, పత్తి కృష్ణయ్య, డాక్టర్ పసుపులేటి కృష్ణయ్య, బి. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, పుత్తా రామచంద్రయ్య, చలపాటి చంద్ర, కొత్తపల్లి మురళీమోహన్, పల్కూరు దత్తాత్రేయులు, సి. సుభాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో కష్టపడితేనే ఉన్నత శిఖరాలు

**భారతీయ రైల్వేస్ నాగ్ పూర్ జాయింట్ జనరల్ మేనేజర్ గాలి శ్రీనివాసులు**




**కడప మన జనప్రగతి జూన్ 14:-** విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని కష్టపడి శ్రమిస్తే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని భారతీయ రైల్వేస్ నాగ్‌పూర్ జాయింట్ జనరల్ మేనేజర్ గాలి శ్రీనివాసులు అన్నారు. తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగరశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల క్రింద నగదు, మెడల్స్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాకుండా జ్ఞానం, నైపుణ్యాలు, ఆలోచనా సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.విద్య అనేది జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, ఏ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన వారైనా విద్య ద్వారా అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. తాను సాధించిన ఉద్యోగ జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర అభ్యాసం విజయానికి మూల సూత్రాలని వివరించారు.విద్యార్థులు పదవ తరగతి పూర్తయ్యాక తమ ఆసక్తులు, సామర్థ్యాలు, భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని సరైన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ వంటి విభాగాలతో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, వృత్తి విద్యా కోర్సులు కూడా మంచి అవకాశాలను అందిస్తున్నాయని తెలిపారు. అనంతరం ఇంజినీరింగ్, వైద్య విద్య, వ్యవసాయ విద్య, డిగ్రీ కోర్సులు, చార్టర్డ్ అకౌంటెన్సీ, సివిల్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు.కేవలం ఉద్యోగం పొందడమే లక్ష్యంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతిరోజూ ఒక ప్రణాళికతో చదవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, మంచి పుస్తకాలు చదవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించడం ద్వారా విజయం సులభమవుతుందని సూచించారు.తల్లిదండ్రులు కూడా పిల్లలపై అధిక ఒత్తిడి తీసుకురాకుండా వారి ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, వారి కలలను సాకారం చేసుకునేలా మార్గనిర్దేశం చేయడం కుటుంబ సభ్యుల బాధ్యత అని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు దశలవారీ ప్రణాళిక రూపొందించుకుని అంకితభావంతో శ్రమించాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు సంఘం నాయకులు, సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నగర శాఖ ,అధ్యక్ష కార్యదర్శులు కల్యా సుధాకర్ పల్లా నరసింహారావు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా సంఘం తరఫున ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా నిరంతరాయంగా ప్రతిభా పురస్కారాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా సిఐ పి నరసింహరాజు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరు సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, సంగీనాదం ఆంజనేయులు సిఆర్ఐ సునీలు, సుంకర రామచంద్రుడు, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, కాల్వ వాగేష్, డాక్టర్ బండారు శ్రీనివాసులు బొల్లు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం
15 - 06 - 2026

## ఈనెల 18న జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 14:-** గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ కడప,ఉమ్మడి వై.యస్.ఆర్.కడప జిల్లా, వారు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశము 18.06.2026వ తేదిన ఉ.10.00 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరము,కడప నందు జరుపుటకు నిర్ణయించినారని కావున ఉమ్మడి వై.యస్.ఆర్. కడప జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, వై.యస్.ఆర్. కడప & అన్నమయ్య జిల్లా అధికారులు అందరూ తప్పక సాధారణ సర్వ సభ్య సమావేశము నకు హాజరు కావలసినదిగా జడ్పీ సి ఈ ఓ సుబ్రమణ్యం తెలిపారు.

## ఉత్సాహంగా పోలీసుల సైకిల్ ర్యాలీ

### - ఫిట్‌నెస్‌పై ప్రజలకు అవగాహన




**అన్నమయ్య జిల్లా బ్యూరో, మన జన ప్రగతి జూన్ 14:-** పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఆదేశాల మేరకు మదనపల్లెలో ఆదివారంసండేస్ ఆన్ సైకిల్' ర్యాలీ అత్యంత ఉత్సాహంగా జరిగింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి బి.సెంట్ సర్కిల్ వరకు కోలాహలంగా సాగిన ఈ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యువత మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ నిత్య జీవితంలో వ్యాయామం, సైక్లింగ్ వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని, తద్వారా శారీరక, మానసిక దృఢత్వం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సందేశమిచ్చారు.

## లింగాలలో ఓ మోస్తారు వర్షం

**లింగాల మన జనప్రగతి జూన్ 14:-** గత కొన్ని రోజులుగా భానుడి భగభగలకు, ఉక్కపోతకు గురవుతున్న లింగాల మండల ప్రజలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఆదివారం వేకువజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మండల పరిధిలోని గ్రామాల్లో కురిసిన మోస్తారు వర్షం స్థానిక ప్రజలకు, రైతులకు తీవ్ర ఉపశమనాన్ని ఇచ్చి వాతావరణం చల్లబడింది.ముందస్తుగా కురిసిన ఈ మోస్తారు చినుకులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్న రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. ఈ వర్షం వల్ల భూమి పదునవుతుందని, దుక్కులు దున్నుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న వృద్ధులు, చిన్నపిల్లలు ఈ చల్లటి వాతావరణంతో ఊపిరి పీల్చుకున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలుపడాలని రైతులు ఆశిస్తున్నారు.

## నేడు శివాల పల్లి శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమావాస్య అభిషేక పూజలు



**చెన్నూరు, మన జనప్రగతి, జూన్, 14:-** చెన్నూరు మండలం శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి( ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయంలో సోమవారం అమావాస్య కావడంతో స్వామివారికి అత్యంత ప్రీతిమైనా రోజు కావడంతో ఉదయం పంచామృత పంచా బి షేకం ఆలయ అర్చక పురోహితులు కిరణ్ కుమార్ శర్మ వేదమంత్రాలతో ఉభయ దాతలచే నిర్వహిస్తారు. వస్త్ర ప్రత్యేక పూల అలంకరణ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ఉభయ దాతలు ఆలయ వ్యవస్థాపకులు పొట్టి పా టి ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు చేతులు మీదుగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయను అన్నారు. ఇక్కడ ఆలయంలో స్వామివారికి అత్యంత ప్రీతికరమైన రోజు అమావాస్య రోజు. అలాగే ప్రతి సోమవారం గురువారం రోజు శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. భక్తులు 9 వారాలు.9 ప్రదర్శనలు ఆలయం చుట్టూ చేసినవారికి వారు అనుకున్న కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు.

## రెడ్ క్రాస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం: రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ సురేష్ కుమార్

**కడప అర్బన్ మన జనప్రగతి జూన్ 14: -** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖలో బ్లడ్ బ్యాంక్ లైసెన్స్ పునరుద్ధరణ కుచర్యలుతీసుకుంటున్నామని రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ మరియు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్ తెలిపారు.. సాధారణంగా బ్లడ్ సెంటర్ లైసెన్స్ ప్రతి ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేస్తారు. అయితే 25 ఆగస్టు 2024న బ్లడ్ బ్యాంక్ లైసెన్స్ రెన్యువల్ చేయాల్సి ఉందని,కానీ అప్పట్లో ఉన్న పాలకవర్గం హయాంలో దీని రెన్యూవల్ కోసం ూచీూణూ అనే షవఎంఞవ శ్రీశీ తగిన సమయంలో ఆన్లైన్లో అప్లై చేయక పోవడంతో ఈ సమస్య వచ్చిందని,గతంలో ఈ రెన్యువల్ ఆఫ్ లైన్ విధానంలో జరిగేదని, అయితే మొట్టమొదటిసారిగా ఆన్లైన్ విధానంలో చేసేందుకు గాను గతంలో ఉన్న పాలకవర్గం ఆన్లైన్లో చలానా కట్టి లైసెన్స్ రెన్యువల్ కు ప్రాసెస్ చేశామని తమకు తెలియజేశారు. కానీ కొన్ని సాంకేతిక కారణాలవల్ల లైసెన్స్ ఫోర్స్ లోకి రాకపోవడంతో సెంట్రల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ వారు తమకు నోటీసు అందజేశారానన్నారు. వారి సూచనల మేరకు ప్రస్తుతానికి బ్లడ్ డొనేషన్, మరియు ఇష్యూస్ అపడం జరిగిందని, అంతేతప్ప రెడ్ క్రాస్ సేవలను నిలపలేదు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో బ్లడ్ సెంటర్ లైసెన్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని జిల్లా సెక్రెటరీ తెలిపారు.

## దివంగత జమాల్ స్మారకార్థం

- జలీల్ బ్యాగ్ షాపు యజమాని జమీల్ దివ్యాంగులకు బ్యాగుల వితరణ
- దాతల సహృదయత దివ్యాంగులకు సౌహార్ధత
- వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 14:-**పదిమందికి సాయం చేయాలనే తపన మనసులో ఉంటే సమాజంలో అభాగ్యులకు ఆసరా కల్పించే దాతలకు కొదవ ఉండదని, అటువంటి సేవాతత్పరతను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని, నిరుపేద కుటుంబంలో జన్మించిన జమాల్ పట్టణంలో చిన్న బ్యాగ్ రిపేర్ దుకాణం ఏర్పాటుచేసి, అంచలంచలుగా ఎదిగి, జలీల్ జిప్ బ్యాగ్ వర్క్ అనే పెద్ద షాపును ఏర్పాటు చేసి, తాను సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని అనాధలకు, దివ్యాంగులకు వెచ్చించి వారికి బాసటగా నిలిచేవారని, తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న కుమారులు జలీల్, జమీల్ ఇరువురు సేవాభావంతో తన తండ్రి స్మారకార్థం దివ్యాంగులకు చేయూతనందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, వారి సేవాస్ఫూర్తి అందరికీ ఆదర్శమని, వికలాంగుల నెట్వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు.పులివెందుల మండలం చంద్రగిరి గ్రామానికి చెందిన దివంగత జమాల్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని, వారికుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒకకార్యక్రమంలో వారి కుమారులు జలీల్, జమీల్ తదితరులు ఆయన పవిత్రఆత్మకు శాంతి చేకూరాలని రెండునిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జమాల్ స్మారకార్థం 30 మంది దివ్యాంగులకు లగేజ్ బ్యాగులు, కాలేజీ బ్యాగులు పంపిణీ చేశారు. తదనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు అందించారు. ఈకార్యక్రమంలో జమాల్ కుమారులు జలీల్, జియాలజిస్ట్ జమీల్, వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు శివాజీరాజారెడ్డి, హరికృష్ణ, టైలరింగ్ టీచర్ మల్లీశ్వరి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**మదనపల్లి మన జనప్రగతి జూన్ 14:-** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అతికారి క్రిష్ణ

**సిద్ధవటం,మన జనప్రగతి, జూన్ 14:-** మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరాపురం గ్రామానికి చెందిన దస్తగిరి కుమారుడి వివాహ వేడుకల్లో ఆదివారం రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ పాల్గొని నూతన దంపతులు మౌలాలితస్లీమ్‌లను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, టీడీపీ రాజంపేట పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి కడితం రామ్మోహన్ నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, జనసేన మండల నాయకులు అతికారి చిన్న వెంకటయ్య, ఆడిటర్ శివానంద, పసుపులేటి గంగయ్య, విజయ్, బిట్టా సాయి తదితర కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: డిఆర్ఓ మల్లికార్జునుడు



**కడప మన జనప్రగతి జూన్ 14:-** నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.ౖశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారునేడు సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)“ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 14:-** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 15వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు. గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## బిఈడి కళాశాలల తనిఖీలల్లో అవినీతికి పాల్పడ్డ వైవియు అధికారుల పై చర్యలు తీసుకోవాలి

- తనిఖీలల్లో కళాశాలలకు అనుకులంగా రిపోర్టులు
- కాగితలకే పరిమితమైన బిఎడ్ కళాశాలలకు ఎలా అడ్మిషన్స్‌కు అనుమతులు ఇస్తారు: పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న



**కడప రూరల్ మన జనప్రగతి జూన్ 14:-** వైవియు పరిధిలోని బిఈడి కళాశాలల అడ్మిషన్స్ కోసం అన్ని సదుపాయలు ఉన్నాయామేడానికి చేసే తనిఖీల లో బిఈడి కళాశాలలతో వైవియు అధికారులు భారీ అవినీతికి పాల్పడ్డారని వారి పై చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్ యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ.. గత నెల రోజులుగా బిఈడి కళాశాలల తనిఖీలను వైవియు సిడిసి అధికారులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, ఏ ఒక్క కళాశాలలకు కూడా బిల్డింగ్, అధ్యాపకులు, విద్యార్థులు, లైబ్రరీ,కనీసం కళాశాలలకు పేరుతో బోర్డు కూడా లేకుండా ఉన్న కూడా ఆయా బిఈడి కళాశాలలకు అనుమతులు ఇచ్చేందుకు వైవియు సిడిసి అధికారులు సిద్ధం అయ్యారన్నారు. అసలు కాగితల మీద మాత్రమే ఉన్న, ఎక్కడ కూడా చిరునామా కూడా లేని బిఈడి కళాశాలలకి అడ్మిషన్స్ కోసం అనుమతులు ఇవ్వడం వైవియు సిడిసి రఘుబాబు మరియు అధికారులకే సాధ్యం అన్నారు. వైవియు సిడిసి రఘు బాబు, వైవియు అధికారులు, సిబ్బంది బిఈడి కళాశాలల మధ్య లక్షల రూపాయలు చేతులు మారాయన్నారు. దీని ద్వారా బిఈడి కళాశాలలు ఏమి లేకున్నా, ఇష్టారాజ్యాంగా తరగతులు నిర్వహించకున్న అధిక ఫీజులతో లోకల్ విద్యార్థులకు అన్యాయం చేస్తూ, బయటి రాష్ట్రల విద్యార్థులకు లక్షల రూపాయలకు అమ్ముకొంటున్నారన్నారు. వైవియు వైస్ ఛాన్సెలర్ బెల్లం కొండా రాజశేఖర్ స్పందించకుంటే యోగివేమన విశ్వవిద్యాలయంకు చెడ్డపేరు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మనోజ్ ,మహేశ్, ఉపేంద్ర , ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

15 - 06 - 2026

# ఇది ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారేనా

- 108 వాహనం వెళ్లాలన్న డ్రైవర్ అన్నకు కుస్తీలా మారింది
- దారిలో గొయ్యి తీసి మరిచిపోయారా
- ఈ ప్లేసులో ఎన్నో ప్రమాదాలు జరిగాయి
- అయినా పట్టించుకోని అధికారులు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 14 :-** తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి నేషనల్ ప్రధాన రహదారి నుండి 250 లేక300 గజాల వరకు దూరం ఉంటుంది. ప్రధాన రహదారి నుండి యు టర్న్ తీసుకోవాలంటే పక్కనే ములకలచెరువు పంచాయితీ అధికారులు గొయ్య తీసి వదిలేశారు. ఆ కాలువ నుండి మురికి నీరు ప్రవహిస్తుండడంతో దుర్వాసనకు ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇదే దారి నుండి ప్రభుత్వ ఆసుపత్రికి మరియు మోడల్ స్కూల్, ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పిల్లల సైతం వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. ఈ కాలువ వల్ల ద్విచక్ర వాహనదారులు మరియు ప్రజలు ఎన్నో ప్రమాదాలకు గురవుతున్నారు. కానీ పంచాయతీ అధికారులు మాత్రం స్పందించకపోవడం ప్రజలు ఆవేదన. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఎలాంటి ప్రమాదాలు కొనసాగకుండా తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# నేడు, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు మన జనప్రగతి జూన్ 14:-** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ఆదివారం తెలిపారు అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.నేడు సోమవారం, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఉదయం 9 .30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. PGRS కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

## పదోన్నతిని బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలి:

# రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షుడు పితాని



**కాకినాడ మన జనప్రగతి జూన్ 14:-** బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగికి పదోన్నతి వస్తే అది బాధ్యతగా భావించి తమ విధులకు పూర్తి న్యాయం చేయాలని జిల్లా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాధరావు పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ మందిరంలో తాళ్లరేవు మండలం డిప్యూటీ తహశీల్దార్గా పనిచేస్తూ శంఖవరం మండలానికి తహశీల్దార్ పదోన్నతి పొందిన మొసలి సూరిబాబు కు పదోన్నతి శుభాకాంక్షల వేడుకల కార్యక్రమమును నిర్వహించారు ఈ పదోన్నతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీఆర్ఎస్ఏ జేఏసీ నాయకుడు పితాని త్రినాధరావు మాట్లాడుతూ సూరిబాబు ఉద్యోగం చేరిన నాటి నుంచి గమనిస్తున్నానని తన సంఘంలో ఓసారి కోశాధికారిగా అత్యధిక మెజారిటీతో గెలిచాడన్నారు. అత్యధికంగా ఆ మండలానికి వీఐపీల తాకిడి ఉంటుందని అక్కడ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సూరిబాబు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అక్కడ విధులు నిర్వహించి మండల ప్రజల మన్ననలను పొందుతానని చెప్పారు. అనంతరం సూరిబాబు దంపతులను తాళ్ళరేవు మండలంకు చెందిన రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, విఆర్ఏలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్రావు, జిల్లా ఉపాధ్యక్షులు కే చంద్రశేఖర్ రెడ్డి, ట్రెజరర్ కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో కూటమి పాలనలో ఎనలేని అభివృద్ధి

### - రాష్ట్రాన్ని రాజధాని లేకుండా ముక్కలు చేసిన జగన్: టీడీపీ మహిళా నేతలు వెల్లడి




**కాకినాడ మన జనప్రగతి జూన్ 14: -** గడచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వ పాలనలో ఎనలేని అభివృద్ధి రాష్ట్రంలో జరిగిందని టీడీపీ మహిళా నేతలు పేర్కొన్నారు. గత మాజీ సీఎం జగన్ అరాచక పాలన వల్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. టీడీపీ మహిళా నేతలు తుమ్మల సునీత, కొప్పనాతి నాగకుమారి, పిర్ల లక్ష్మీ ప్రసన్నలు ఆదివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ వారు టీడీపీ కూటమి పాలనపై దుష్ప్రచారం చేస్తూ ర్యాలీలు చేయడం అర్ధరహితమన్నారు. రెండు నెలల్లో జరిగిన అభివృద్ధి వారు విమర్శించడం తగదన్నారు గడిచిన రెండేళ్ల కాలంలో రోడ్లు, పింఛనులు, తల్లికి వందనం, మత్స్యకార భరోసా వంటి పథకాలు అందించి వారి అభిమానానికి గురయ్యామని చెప్పారు. టీడీపీని విమర్శించిన వైసీపీ మహిళా నేత సుంకర శివప్రసన్న టీడీపీ నుంచి కార్పొరేటర్గా గెలిచిన సంగతి మర్చిపోయారన్నారు. టిడిపి నుంచి వైసీపీలోకి ప్లేటు ఫిరాయించిన ఆమె విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయినట్లు వారు పేర్కొన్నారు. డీఎస్సీ, పోలీస్ ఉద్యోగంలు ఇవ్వడమే కాకుండా పరిశ్రమలు, పెట్టుబడులు సీఎం చంద్రబాబు రాష్ట్రంలో తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు ముందు జగన్ ఎప్పటికీ సరిపోరని వారు ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వడిసెల దాలమ్మ, నమ్మి సత్యవాణి, తిరుదు ఎల్లమ్మ , బంగారు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్యను పరిష్కరించండి

- రోడ్డు ఎక్కి ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు
- నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు క్రిష్టప్ప



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 14 :-** మదనపల్లి పట్టణం కేంద్రం మున్సిపాలిటీకి కొంత దూరంలో ఉన్నకోళ్ల బైలు 1 స్వర్ణ గ్రామ పంచాయతీ లో నెలకొన్న మౌలిక సమస్యలైన మంచినీరు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, పారిశుద్ధ్య వంటి సమస్యను పరిష్కరించాలని నేడు కోళ్ల బైలు శివాలయం వీధి ఇందిరమ్మ కాలనీ వాసులు కాలనీలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప మాట్లాడుతూ అలాగే వీధిలైట్లు మురికి కాలువలు పెండింగ్ లో ఉన్న రోడ్లు మరమ్మతులు నూతన సిసి రోడ్లు వేయాలని పారిశుధ్యం కోళ్ల బైలు వన్ కాలనీలో వీధి కులాయి లకు నీటి సరఫరా మూడు నెలలకు ఓసారి జరుగుతున్నదని ఈ సమస్య పైన పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, స్పెషలాఫీసర్ , ఎంపీడీవో తో మాట్లాడడం జరిగింది, ఫిర్యాదులు చేయడం జరిగిందని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యమని ఇక్కడ నీళు వదులుతున్న షహీనా అనే మహిళ ప్రజల పట్ల అవాకులు చవాకులు అవహేళనగా వ్యవహరిస్తుందని ఆమెను తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న నాథుడు లేదని వాపోయారు ఈ పంచాయతీకి సంబంధించి నీటి ట్యాంకర్లు ఉన్నా కూడా నీటి సమస్య బర్నింగ్ సమస్యగా ఉన్న పేదలు తమ కూలి డబ్బులు సగానికి పైన నీటికే ఖర్చు చేయవలసిన పరిస్థితి దూపరించిందని నీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన నీటి ట్యాంకర్లతో ఇంటింటికి నీటిని సరఫరా చేయాల్సింది పోయి పంచాయతీలో ఉన్న మూడు నాలుగు ట్యాంకర్లను అధికారుల ఇండ్లకు తోలుతూ మిగిలిన సమయంలో మున్సిపాలిటీకి డబ్బులకు నీటిని ట్యాంకర్ తో సంపులకు తోలుతున్నారని ఈ అక్రమాలపై విచారణ చేపట్టాలని పంచాయతీలో ఉన్న నిధులు ప్రజలకు ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం ధోరణి వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు అనంతరం ఖాళీ బిందెలతో బిందెతో కోళ్ల బైలు కాలనీలో ధర్నా కార్యక్రమ చేపట్టడం జరిగింది పంచాయతీ వ్యవస్థ పంచాయతుల అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేని దుర్మార్గపు పరిస్థితులు పంచాయతీ వ్యవస్థ ఉన్నదని ప్రభుత్వాలు స్వర్ణ పంచాయితీ అని ప్రజల్ బాలు పలుకుతూ మౌలిక సమస్యలు కూడా పరిష్కరించలేని విధంగా ఉన్నారని పంచాయతీలో నివసిస్తున్న పేద మధ్యతరగతి ప్రజలు తమ విధిగా ఇంటి పన్ను నీటి పన్ను పారిశుద్ధ్యం పన్ను లైబ్రరీ పన్ను చెల్లిస్తున్న కనీస అవసరాలు తీర్చడం లేదని మేము కట్టే డబ్బులు ఎటుపోతున్నాయని వారు ప్రభుత్వాన్ని ప్రభుత్వాధికారులను ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కొండయ్య ,శారదమ్మ ,భాగ్యమ్మ, నారాయణమ్మ, షకీలా పురుషోత్తం, భవాని, పార్వతమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

# వాల్మీకిపురంలో ఏసీఏ సౌత్ జోన్ అండర్-16 బాలుర క్రికెట్ పోటీలు ప్రారంభం





**వాల్మీకిపురం మన జనప్రగతి జూన్ 14:-** సిడిసిఏజీవీఎస్సీఎస్ గ్రౌండ్స్, వాయల్పాడులో ఏసీఏ సౌత్ జోన్ అండర్-16 బాలుర అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.గ్రౌండ్-ఏలో జరిగిన కర్నూలునెల్లూరు జట్ల మ్యాచ్‌ను సిడిసిఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ అధ్యక్షుడు శ్రీనివాస్ మూర్తి, కార్యదర్శి సతీష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ, వాల్మీకిపురంలో అండర్-16 అంతర్ జిల్లా పోటీల నిర్వహణకు సహకరించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్ని, కార్యదర్శి సానా సతీష్, జాయింట్ సెక్రటరీ (క్రికెట్) విజయ్, అలాగే సిడిసిఏ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు మరియు నెల్లూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని చెప్పారు. సుమారు 20 రోజుల పాటు కొనసాగే ఈ పోటీలు మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌ల తరహాలో నిర్వహించబడతాయని వెల్లడించారు.యువ క్రికెటర్లు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని, సౌత్ జోన్ నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఇక గ్రౌండ్-బిలో అనంతపురంకడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌ను సిడిసిఏ అధ్యక్షుడు శ్రీనివాస్ మూర్తి ప్రారంభించారు.కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా చీఫ్ కోచ్ సునీల్ కుమార్, కర్నూలు కోచ్ ప్రసన్న కుమార్, అనంతపురం కోచ్ షోయబ్, కడప కోచ్‌లు, సౌత్ జోన్ సెలెక్టర్లు జవహర్ భాష, హరీష్, రెడ్డి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా ఆదోని ఆర్టీసీ బస్టాండ్

### - ఆదోని బస్టాండ్‌లో ఉదయం 6-30ని పరిస్థితి







**ఆదోని మన జనప్రగతి జూన్ 14:-** నిత్యం ఆంధ్ర కర్ణాటక ప్రాంతాలకు పయనించే ప్రాణికులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ వర్షం వచ్చిందంటే చాలు అద్వానంగా తయారవుతుంది... ఇది ఎక్కడో కాదు ఆదోని కొత్త బస్టాండ్ పరిస్థితి. ఆర్టీసీ అధికారులు ఈ దుస్థితిని చూసి చూడనట్టు వివరించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్లోపల పశువుల పెంట, వర్షపు నీరు, ప్రయానీకులు కూర్చునేందుకు, నిల్చునేందుకు కూడా వీలు లేని పరిస్థితి. అత్యంత అందమైన సుందరమైన బస్టాండ్ కర్నూలు జిల్లాలో ఇదేనేమో. 40 ఏళ్లుగా ఆదోని అభివృద్ధి ఇలా ముందుకు సాగింది... ఆదోని ప్రజల అసహాయతకు నిద్రావస్థకు ఇదే నిదర్శనం అని చెప్పవచ్చు.ఆదోని ని అన్ని విధాలుగా అభివృద్ధి ,చేస్తామంటు ఉత్తుత్తి మాటలు చెప్పుకుంటూ, ప్రజల్ని మభ్యలో పెట్టి తిరుగుతున్న ప్రజా ప్రతినిధుల్లారా నిద్ర లేవండి.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి, ప్రయాణికులు ఎంత ఇబ్బంది పడుతున్నారో తెలుస్తుంది అని ప్రయాణికులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. లక్షల కార్లలో తిరుగుతే ఏం అర్థం అవుతుందో అర్థం అవుతది నాయకుల్లారా బస్టాండులో పరిస్థితి గమనించండి అని కోరుతున్నారు. ఇప్పుడైనా నిద్ర లేవండి బస్టాండ్ అభివృద్ధికి పాటుపడండని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఎస్టీ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగుల పంపిణీ




**సిద్ధవటం, మన జనప్రగతి, జూన్ 14:-** మండలంలోని రామస్వామిపల్లె గ్రామంలో ఆశా కిరణం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద ఎస్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ దట్టమైన అటవీ ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యా ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో 30 మంది విద్యార్థులకు పాఠశాల సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. సమాజంలోని దాతలు ముందుకు వచ్చి ఇలాంటి కుటుంబాలకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్ చిన్న వెంకటయ్య, జి. వెంకటసుబ్బయ్య, శంకర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంతర పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 14:-** రైతులు మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. మండలంలోని కడపాయపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇన్ ఫ్రట్స్ డే కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి వారు మాట్లాడారు. జొన్న, అలసంద, అనప, గోరుచిక్కుడు, కంది వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడికి తగిన ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రధాన పంటలతో పాటు అంతర పంటలు సాగు చేయడం రైతులకు లాభదాయకమని పేర్కొన్నారు. అలాగే చీడపీడల నివారణకు జీవామృతం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.సి. సింగరయ్య, చంద్రకళ, భాగ్యలక్ష్మి, పద్మావతి,వెంకటనారాయణతోపాటు రైతులు పాల్గొన్నారు.

# పుంగనూరు ఈడిగి పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- దంపతులు అక్కడికక్కడే మృతి
- చావులోనూ వీడని భార్యాభర్తల బంధం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 14 -** పుంగనూరు నియోజకవర్గం పుంగనూరు (మం), ఈడిగిపల్లె వద్ద ఆదివారం బైక్ ను బొలెరో ఢీకొని, మదనపల్లె కు చెందిన దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు అమీర్ (45) సల్మా (40)లు గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో వారి కొడుకు ముస్తాఖీర్ (19)కు తీవ్రగాయాలు కావడంతో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి: రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 14:-** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
15 - 06 - 2026

# సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెందులోను ఉండదు

## - ఫ్యాన్ల వితరణలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 14:-** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో యస్.ఎన్.కాలనీ వాస్తవ్యులు కీ:శే:చంద్రావతి 11 వ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు ఉపాధ్యక్షుడు లయన్ వి.హరీష్ చంద్ర(బబ్లూ) ఆర్థిక సహాయంతో బస్టాండ్ దగ్గర ఉండే నిరాశ్రయుల వసతి గృహానికి ఫ్యాన్లు అందజేయడం జరిగిందని కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్ తెలిపారు.అనంతరం దాత ఉపాధ్యక్షుడు లయన్ వి హరీష్ చంద్ర( బబ్లూ) మాట్లాడుతూ మా తల్లి చంద్రావతి గారి 11 వ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ దగ్గర ఉండే నిరాశ్రయుల వసతి గృహానికి ఫ్యాన్లు అందజేయడం జరిగిందని అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే సేవ చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్,నిరాశ్రయుల వసతి గృహం అధ్యక్షులు కె.ఎస్.షర్మిల బాను,మెంబర్ ఎ.చాన్ భాష,తదితరులు పాల్గొన్నారు.

# శింగనమల నూతన సీఐగా రాగిరి రామయ్య బాధ్యతల స్వీకరణ



**ఉరవకొండ, మన జనప్రగతి జూన్ 14:-** అనంతపురం జిల్లా శింగనమల నూతన సీఐగా రాగిరి రామయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అవుట్‌గోయింగ్ సీఐ కొలుట్లయ్య ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు.రాగిరి రామయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు మరియు అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.గతంలో ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురం ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఆయన నిష్పక్షపాత అధికారిగా గుర్తింపు పొందారు. ఏపీఎస్ఆర్‌టీసీలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా సేవలు ప్రారంభించిన రామయ్య, అనంతరం పోలీస్ శాఖలో ఎస్ఐగా చేరి ప్రస్తుతం సీఐ స్థాయికి ఎదిగారు. ఆయన రాకతో నియోజకవర్గంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# చిత్తూరు రోడ్డు గ్రామీణ బ్యాంక్ ప్రక్కనున్న జీసస్ నగర్‌కు దారేది..?

**పీలేరు మన జనప్రగతి జూన్ 14 :-** చిత్తూరు కడప జాతీయ రహదారి పీలేరు చిత్తూరు రోడ్లో గ్రామీణ బ్యాంక్ దొడ్డిపల్లి బ్రాంచ్ ప్రక్కన ఉన్న జీసస్ నగర్.కు దారి లేక ఆ వీధి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిత్తూరు జాతీయ రహదారి రోడ్డు పనులు మొదలుపెట్టి మూడు సంవత్సరాల కావస్తున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే జీసస్ నగర్ వీధికి వెళ్లే దారి రోడ్డు పనులులో భాగంగా త్రవ్వేశారు. ఇంతవరకు దానిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ వీధి లో కాపురస్తులు ఎన్ హెచ్ వారికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని మండల స్థాయి అధికారులకు తమ విన్నపాలు ఇచ్చామని ఎవరు గానీ స్పందించలేదని మా పరిస్థితి ఇలాగే ఉంటే మెయిన్ రోడ్ నుంచి వీధిలోకి వెళ్లాలంటే నరకంగా ఉందని ఎక్కడ కాలవల్లో పడిపోతావ్ అని భయంగా ఉందని అసలే వర్షాకాలం మొదలైంది వీధికి దారి లేక స్కూలుకు కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లే వారికి దారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఏది ఏమైనా ఎన్ హెచ్ వారు కానీ మండల స్థాయి అధికారులు గాని వెంటనే స్పందించి మా వీధికి దారి మరమ్మత్తులు చేయాలని అధికారులను వినమ్రంగ కోరుకుంటున్నామని. మా బాధలు ఇబ్బందులు తెలుసుకొని వెంటనే దారి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో వీధిలో కాపురస్తులందరము రోడ్డుపైన బైఠాయించాల్సి వస్తుందని ఆ పరిస్థితికి అధికారులు తీసుకురాకుండా మా సమస్య పరిష్కరించండని విన్నవించారు.



# రక్త దాతలే అసలైన హీరోలు

## - రక్త దాతలు సృష్టికర్త బ్రహ్మ దేవునితో సమానం: డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 14:-** ప్రపంచ రక్త దానం దినోత్సవం సందర్భంగా వేంపల్లె లో కాంగ్రెస్ నాయకులు రక్త దాతలను ఘనంగా సన్మానించారు. వేంపల్లి ఆర్య వైశ్య సంఘానికి చెందిన పుల్లకూర గోవర్ధన్ , రాయవరం వెంకట సుబ్బారావు 20 సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలను కాపాడారు. అంతేకాకుండా అనేక మందిని రక్త దానం చేసే దానికి ప్రోత్సహించి కొన్ని వేల మంది ప్రాణాలను కాపాడారు.వీరిద్దరిని కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్స్ ను కనుగొన్న ఆస్ట్రియన్ శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్ స్టీనర్ జన్మదినమైన జూన్ 14 ను ప్రపంచ రక్తదాన దినోత్సవం గా ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని, 2004 నుంచి ఇది అమలులో ఉందని ఆయన అన్నారు.రక్తం యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించడం, రక్త దాతలకు కృతజ్ఞతలు తెలపడం,రక్తదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించడం దీని ఉద్దేశం అన్నారు.ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుంది. 18--65 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ఆరోగ్యవంతుడైన పురుషుడు మూడు నెలలకు ఒకసారి, ఆరోగ్యవంతురాలు అయిన మహిళ నాలుగు నెలల కోసారి రక్తదానం చేయవచ్చు.అదే సమయంలో రక్తదానం రక్తదాతలకు కూడా ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. గుండెపోటును తగ్గిస్తుంది.రక్తదానం చేయడం వల్ల నీరసం వస్తుందని,శక్తి తగ్గిపోతుంది అనుకోవడం అపోహ మాత్రమే.రక్తదానం వలన మరింత శక్తి వస్తుంది, మరింత ఉత్సాహం వస్తుందన్నారు.అన్నదానం అన్ని దానాల లోకేల్లా ప్రధానమైనదని ఒకప్పుడు అనేవారు.రక్తదానం అన్ని దానాల లోకేల్లా ప్రధానమైనది అన్నది నేటి మాట. రక్తదాతలు ప్రాణదాతలు. సృష్టికర్త బ్రహ్మ తో సమానం. ప్రతి రక్తదాత ఒక అసలైన హీరో అని ఆయన అన్నారు.రక్తదానం మానవత్వానికి మచ్చుతునక అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బద్రీనాథ్, వేమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నారీ శక్తికి ప్రతీక జగదాంబ సరస్వతి మమ్మా

## - బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో ఘన నివాళులు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 14 :-** బ్రహ్మకుమారీస్ సంస్థ తొలి అధ్యక్షురాలు జగదంబ సరస్వతి మమ్మా గారి 61వ పుణ్యస్మృతి దినాన్ని పురస్కరించుకుని నారీ సశక్తీకరణ దినోత్సవాన్ని ఆదివారం ఆర్ టి పి పి ఓం శాంతి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదంబ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, విశ్వశాంతి కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటలపాటు సామూహిక రాజయోగ ధ్యానం నిర్వహించారు.కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సభ్యులు బి కె శాంత, బి కె సౌజన్య తదితరులు పాల్గొని జగదంబ సరస్వతి మమ్మా సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బి కె శాంత మాట్లాడుతూ, విశ్వశాంతి స్థాపనకు జీవితాన్ని అంకితం చేసిన మహాయోగుల్లో జగదంబ సరస్వతి ఒకరని పేర్కొన్నారు. "స్వయం పరివర్తనతోనే విశ్వ పరివర్తన" అనే సందేశంతో తన 17వ ఏటనే సంస్థ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి రాజయోగాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారని తెలిపారు. మహిళలను ఆత్మజ్ఞానం, సదాచారం ద్వారా సశక్తీకరించడంలో ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, మానసికశారీరక వేధింపులను ఎదుర్కొనేందుకు రాజయోగ జీవన విధానం దోహదపడుతుందని, ప్రతి మహిళ శక్తి స్వరూపిణిగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారన్నారు. జగదంబ బోధనలను ఆచరిస్తూ ఆత్మసంస్కరణ సాధిస్తే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని తెలిపారు. 1919లో పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జన్మించిన జగదంబ సరస్వతి, 1936 నుంచి 1965 వరకు బ్రహ్మకుమారీస్ సంస్థ అధ్యక్షురాలిగా సేవలందించారు. ఆమె నాయకత్వంలో దేశవ్యాప్తంగా 600కు పైగా సేవా కేంద్రాలు స్థాపించబడగా, వందలాది రాజయోగ శిక్షకులను తీర్చిదిద్దారు. జ్ఞానం, యోగం, సేవలతో కర్మాతీత స్థితిని పొందిన ఆమె 1965 జూన్ 24న పరమపదించి 'మాతేశ్వరి'గా చిరస్మరణీయులయ్యారని వక్తలు పేర్కొన్నారు.

# రైతులకు ఆర్థిక భరోసాగా పీఎం-కిసాన్ పథకం: బీజేపీ నేత నరేంద్రరావు

## - ఏడాదికి రూ.6 వేల సాయం: 9 కోట్లకు పైగా రైతులకు లబ్ధి

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 14:-** దేశ రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం విజయవంతంగా కొనసాగుతోందని బీజేపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించిన ఈ పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభంలో చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే పరిమితమైన ఈ పథకాన్ని అనంతరం అన్ని అర్హులైన భూస్వామ్య రైతు కుటుంబాలకు విస్తరించారని తెలిపారు. దేశవ్యాప్తంగా 9 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, ఇప్పటివరకు రూ.3.46 లక్షల కోట్లకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. వ్యవసాయ అవసరాలు, విత్తనాలు, ఎరువుల కొనుగోలు వంటి ఖర్చులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు.మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిధులు నేరుగా రైతుల ఖాతాలకు చేరడం వల్ల పారదర్శకత పెరిగిందని, రైతుల ఆదాయాన్ని పెంచి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని నరేంద్రరావు పేర్కొన్నారు.



# ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఎంతో విలువైనది పవిత్రమైనది

## - చెన్నూరు ఎంఈఓ డి గంగిరెడ్డి పదవి విరమణ సభలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



**చెన్నూరు, కడప మన జనప్రగతి జూన్ 14 :-** దేశం కోసం రాష్ట్రం కోసం బావి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఎంతో విలువైనది పవిత్రమైనదని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం చెన్నూరు మండల విద్యాశాఖ అధికారి దిద్దికుంట గంగిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా చెన్నూరు మండల ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన సన్మాన సభ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంత సేవ చేసినా విలువ కట్టలేని వి అని కొనియాడారు. ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీ అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించవలసి వస్తుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీలో విద్యావ్యవస్థ వేగంగా ముందుకెళుతున్నదని అభినందించారు. ఉపాధ్యాయునిగా విద్యార్థులకు చక్కటి విద్యను బోధిస్తున్నారని తెలిపారు. పదవీ విరమణ చేస్తున్న గంగిరెడ్డి 37 సంవత్సరాలు విద్యార్థులకు సేవలందియడం అభినయందునీయమని కొనియాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఉపాధ్యాయులు సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలని సూచించారు. కడప జిల్లా డిపిఎం. డి ఎం. సి. హరి ప్రసాద్ మాట్లాడుతూ పదవి విరమణ చేసిన గంగిరెడ్డి నా చిరకాల మిత్రుడని ఇద్దరం కలిసి చదువుకున్నామని తెలిపారు. వేముల కడప చిన్నమండెం రాజంపేట నందలూరు చెన్నూరు మండలాల్లో మండల విద్యాశాఖ అధికారిగా గంగిరెడ్డి పనిచేస్తూ మంచి సేవలు అందించారని కొనియాడారు. సమావేశం అనంతరం పదవి విరమణ చేసిన గంగిరెడ్డి ని ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో వేంపల్లి ఎంఈఓ వి వెంకట రామిరెడ్డి. రాజంపేట ఎండిఓ నాథ్. నందలూరు ఎంఈఓ అనంత. చెన్నూరు ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు. చెన్నూరు తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి. ఇంది రెడ్డి శివారెడ్డి. ఉపాధ్యాయ యూనియన్ నాయకులు శివారెడ్డి తిరుపాల్ బాల గంగిరెడ్డి ఆంజనేయులు శివప్రసాద్ జాఫర్ సాదిక్. చెన్నూరు చిన్నమండెం రాజంపేట నందలూరు కడప మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పలువురు అధికారులు గంగిరెడ్డి కుటుంబ సభ్యులు సాలవుల కప్పి పూలమాలలతో సత్కరించి మెమెండోలు అందించారు.

# ప్రపంచ రక్తదాతల దినోత్సవం పలువురు రక్తదానం



**కాకినాడ మన జనప్రగతి జూన్ 14:-** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు అధ్యక్షత వహించి స్వయంగా రక్తదానం చేసి సభ్యులకు ఆదర్శంగా నిలిచారు. యాళ్ల సాయి విజయదుర్గ, బి శ్రీను, బి ప్రసాద్, జి జయసూర్య, పి వీరేష్, పి అశోక్ వీర్, కె వెంకట్, ఎం నారాయణ, ఎ లక్ష్మణ్ తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రత్నారావు మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా రక్తదాన శిబిరాల చైర్మన్ దిలీప్ కుమార్ సధనాని స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. మాజీ జిల్లా గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు యడవిల్లి మురళీధర్, జోన్ చైర్‌పర్సన్ కె శ్రీదేవి, పడాల సూర్యనారాయణ రెడ్డి, యాళ్ల పద్మ, ఎన్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ కామరాజు, సిబ్బంది శిబిరం నిర్వహణలో సహకరించారు.

# సాక్షాలు నేను చూపిస్తా చర్చకు సిద్ధమా..: టిడిపి 47వ డివిజన్ ఇంచార్జి రెడ్డి హుస్సేన్




**కడప మన జనప్రగతి జూన్ 14:-** మాజీ మేయర్ పాక సురేష్ తన ఇంటి వద్ద వేసుకున్న ర్యాంపు పై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అవసరమైతే చర్చకు సిద్ధమాని 47 డివిజన్ టీడీపీ ఇన్చార్జి రెడ్డి హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా టిడిపి నగర అధ్యక్షులు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్డుకు తన ఇల్లు ఎత్తుగా ఉందని ప్రభుత్వానికి ఉపయోగించాల్సిన ర్యాంపు స్టోన్స్ లను తన ఇంటికి ఉపయోగించుకొని ర్యాంపు స్టోన్స్ కోసం 52 వేల రూపాయలు కట్టానని చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. తన ఇంటి వద్ద ఉన్న సచివాలయానికి సీసీ కెమెరా కనెక్షన్ డైరెక్ట్ గా తన ఇంటికి బిగించుకున్నది నిజం కాదా. 15 సంవత్సరాలు కార్పొరేటర్ గా ఉండి మూడు నెలలు మేయర్ గా ఉండి ప్రభుత్వ రోడ్డులో అడ్డంగా ఎలా రోడ్డు పెంచుకుంటార న్నారు. నీ అవినీతి బాగోతం ప్రజలందరికీ తెలుసు. ఎక్కడ ప్రభుత్వం ఉంటే అక్కడికి వాలిపోవడం నీ నైజం. శశి అనే వ్యక్తి 26 రోజులు జైలు జీతం గడిపారన్నావు. నువ్వు నిజం నిరూపించగలవా 2005లో మీ ఆర్థిక పరిస్థితి ఎంత ఇప్పుడు నీకున్న ఆస్తి ఎంత. అవినీతి చేసి ఇంత సంపాదించగలవు అందరికి తెలుసు. వచ్చే స్థానిక ఎన్నికల్లో నా మీద పోటీ చేసి గెలిచి చూపించు. నువ్వు ఎప్పటికీ కార్పొరేట్ కాలేవు. నువ్వు చేసిన అన్యాయానికి ప్రజలంతా గుర్తిస్తున్నారు. డీ లిమిటేషన్ పై నేను హైకోర్టులో కేసు వేసి ఉంటే స్టే వచ్చిందని సంకలు గుద్దుకుంటున్నావు , అది నీ ఒక్కడికే కాదు రాష్ట్రంలో ఉన్న అనేక ప్రాంతాల్లో కూడా స్టే వచ్చింది. అబద్దాలతో ప్రజలు నమ్మించవద్దని తెలిపారు. నీవు మేక తోలు కప్పుకున్న పులిలాంటి వాడవు. మీ నాయకుడు మొన్న ఎలక్షన్లో నా ముఖం చూసి ఓట్లు వేయండి అని ప్రజలు అడిగినప్పుడే మీరు చేసిన అవినీతి ప్రజలకు అర్థమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, రమేష్ ,హరి, జీవన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
15 - 06 - 2026

# వేముల మండలంలో 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ' కార్యక్రమం ప్రారంభం

- **జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఎస్ఐఆర్ - 2026 నిర్వహణ**
- **అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పిలుపు.**



**వేముల మన జనప్రగతి జూన్ 14:**-భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వేముల తహసీల్దార్,సహాయ ఎన్నికల నమోదు అధికారి శివలక్ష్మి తెలిపారు.ఆదివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ...ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన ప్రతి పౌరుని పేరు ఓటరు జాబితాలో నమోదు చేయడంతో పాటు మరణించినవారు,శాశ్వతంగా వలస వెళ్లినవారు,చిరునామా మార్చుకున్నవారు,నకిలీ నమోదులను గుర్తించి తొలగించడమేనని పేర్కొన్నారు.అలాగే 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగమని వెల్లడించారు.మండలంలోని ప్రతి ఓటరు తమకు అందజేయబడిన ఎన్యూమరేషన్ ఫారం (ఈఎఫ్) ను పూర్తిగా నింపి,అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీ.ఎల్.ఓ) లు సమర్పించాలని సూచించారు.అదేవిధంగా ఓటరు జాబితాలో తమ పేరు,చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకుని,అవసరమైతే సంబంధిత ఆధార పత్రాలను సమర్పించి సవరణలు చేసుకోవాలని కోరారు.ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్వోలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని,ఖచ్చితమైన,పారదర్శకమైన ఓటరు జాబితాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ శివలక్ష్మి విజ్ఞప్తి చేశారు.మండల పరిధిలోని ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

# జనసేన ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కేకేకు జన్మదిన శుభాకాంక్షలు

**- పులివెందుల జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్ అభినందనలు**



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 14:**-జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాసరావు (కేకే)కు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ...కేకేకు ఈ పుట్టినరోజు మరెన్నో విజయాలు, ఉన్నత బాధ్యతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ బలోపేతం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేకే చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న కేకే నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని,భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని డాక్టర్ రవిశంకర్ ఆకాంక్షించారు.

# ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ దరఖాస్తులు అందించి పూర్తి చేయించండి

**- తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి.**




**తిరుపతి మన జనప్రగతి జూన్ 14:**- ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ దరఖాస్తులు అందించి, పూరించిన వాటిని జులై 14 లోపు సేకరించి ఆన్లైన్ చేయాలని 167 తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి శారదా దేవి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఓటర్ నమోదు, యోగాంధ్ర - 2026, తల్లికి వందనం అంశాలపై అధికారులు, సూపర్ వైజర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అత్యంత కీలకమైన ఎన్యుమరేషన్ ఫారం పంపిణీ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు, సూపర్వైజర్లు మీ పోలింగ్ కేంద్ర పరిధిలోని బూతులెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకొని ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబంలోని ఓటర్లకు ఎన్యుమరేషన్ దరఖాస్తులను పంపిణీ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను ఒక వారంలో పూర్తి చేయాలని, అలాగే ఒక వారం తర్వాత ఓటరు చే నింపబడిన ఎన్యుమరేషన్ పారాలను సేకరించాలని తెలిపారు. కనీసం మూడుసార్లు అయినా ఆ ఇంటిని సందర్శించి, ఎన్యుమరేషన్ పారమ్ నింపడంలో సందేహాలు ఉంటే సాయం అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని జులై 14 లోపల పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవన శైలి పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ యోగాంధ్ర లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని తెలిపారు. తల్లికి వందనం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ఓటర్ల నమోదు అధికారులు అమరయ్య, సురేష్ బాబు, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, రెవిన్యూ అధికారి సేతుమాదవ్, సెక్రటరీ శ్రీవిద్య, ఎన్నికల ఉప తాసిల్దారు సుధాకర్ నాయక్, ఏసిపిలు పార్వతి ప్రియ, మూర్తి, డీఎఫ్ఓ శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ మధు , తదితరులు ఉన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై అపోహలొద్దు

**- వేంపల్లెలో నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల సవరణ: తహసీల్దారు జిల్లా శివశంకర్ రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 14 :-** ఆయా గ్రామాల్లో చేపట్టబోయే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్ ) కార్యక్రమం పై ఎవరికి ఎలాంటి అపోహ వద్దని వేంపల్లె తహసిల్దార్ జిల్లా శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో సోమవారం నుంచి జూలై 14 వరకు ఈ ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి పౌరుల ఓట్లు జాబితాలో ఉండేలా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. నకిలీ ఓటర్లను, చిరునామా మార్చుకున్న వారి ఓట్లను, గ్రామాల్లో మరణించిన వారి పేర్లు, వలస వెళ్లిన వారి పేర్లను ఈ జాబితా నుంచి తప్పిస్తామన్నారు. అంతేకాకుండా 1-7- 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులు ఓటర్లుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తులు అధికారులకు అందించాలని కోరారు. ఓటర్లు జాబితాలో తమ పేరు, చిరునామా ఇతర వివరాలు సరిగా ఉన్నాయో లేవో అవసరమైన పత్రాలను తమ సిబ్బందికి అందించాలని కోరారు.ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పరిశీలనకు బిఎల్ఓ లు గ్రామాలకు వస్తారని వారికి ప్రజలు సహకరించి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితాల తయారీలో భాగస్వాములు కావాలని తహసిల్దార్ కోరారు.

# ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం


**- వేంపల్లె ప్రముఖ వైద్యులు ఎస్.ఎఫ్. బాషా**



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 14 :-** ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వేంపల్లె జెడ్పిటిసి మాజీ సభ్యుడు, పట్టణ ప్రముఖ వైద్యుడు ఎస్ ఎఫ్ బాషా అన్నారు. కడప చైత్ర న్యూరో ఈఎన్టీ కేర్, డాక్టర్ ఎస్ ఎఫ్ బాషా, ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గండి రోడ్డు లోని ఎస్ ఎఫ్ భాషా ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కడపకు చెందిన ప్రముఖ వైద్యుడు ప్రియతమ్ భార్గవ్ పాల్గొని సుమారు 100 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెదడు, వెన్నెముక, నరముల సమస్య ఉన్న వారందరినీ పరీక్షించి సూచనలు,సలహాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాషా మాట్లాడుతూ సమాజంలోని పేద వర్గాల వారి కోసం తరచూ తమ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందిస్తున్నామన్నారు పేదలకు సాయపడాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు ప్రజలు వైద్యుల ఆరోగ్య సూచనలు పాటిస్తే ఆ కుటుంబాలకు, సమాజానికి మేలు జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో భారత్ మెడికల్స్ నిర్వాహకుడు, వేంపల్లి వైస్ ఎంపీపీ బాబా షరీఫ్ భాషా హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు

**రాయచోటి మన జనప్రగతి జూన్ 14:-** రాయచోటి పట్టణంలోని మేదర వీధి వాస్తవ్యులు, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి మయాన షబ్బీర్ అహమ్మద్ ఖాన్ కుమార్తె మయాన హేబా ఖానం గారి నిఖా వేడుక షేక్ ఇలియాజ్ బాషా తో ఘనంగా నిర్వహించబడింది.ఈ శుభకార్యానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వివాహ బంధం అనేది ప్రేమ, పరస్పర గౌరవం, నమ్మకానికి ప్రతీక. వధూవరులు జీవితాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా దాంపత్య జీవితాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆకాంక్షించారు.మయాన హేబా ఖానం షేక్ ఇలియాజ్ బాషా దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి జీవితంలో ప్రతి క్షణం ఆనందమయం కావాలని, అల్లాహ్ కృపతో ఐశ్వర్యం, ఆరోగ్యం, సంతోషాలు నిండాలని ఆకాంక్షిస్తూ రెండు హృదయాల కలయికతో ప్రారంభమైన ఈ కొత్త ప్రయాణం ప్రేమ, శాంతి, ఆనందాలతో చిరస్థాయిగా వికసించాలి.తెలుగుదేశం పార్టీ కుటుంబం తరపున వధూవరులకు శుభాకాంక్షలు.



# గంగనపల్లె గంగమ్మ గుడి హుండీ చోరీ





**తొండూరు మన జనప్రగతి జూన్ 14 :-** మండల పరిధిలోని గంగనపల్లె గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఆలయంలో చోరీ కలకలం రేపింది. గ్రామంలోని గంగమ్మ తల్లి ఆలయంలోకి చొరబడిన గుర్తు తెలియని దుండగులు హుండీని పగలగొట్టి నగదు అవహరించుకుపోయారు. శనివారం రాత్రి ఆలయ తలుపులు మూసి ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ఆలయ పూజారి గుడికి రాగా,హుండీ పగలగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే గ్రామ పెద్దలకు,సమాచారం అందించారు. హుండీలో ఎంత సొమ్ము ఉందనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. గత కొన్ని వారాలుగా హుండీ లెక్కించకపోవడంతో అందులో కొంత మొత్తం నగదు ఉండవచ్చని గ్రామ పెద్దలు భావిస్తున్నారు.

# ప్రైవేట్ స్కూల్స్ పుస్తకాల దందా ఆపాలి..

**అధికారుల తనిఖీలు చేపట్టాలి**

**ప్రైవేట్ స్కూల్స్ పుస్తకాల దందాపై చర్యలు తీసుకోవాలి**

**ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్**



**షాద్ నగర్, మన జనప్రగతి జూన్ 14 :** షాద్‌నగర్ ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, షూస్ విక్రయాల దందాపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను బలవంతంగా స్కూల్ యాజమాన్యం సూచించిన షాపుల నుంచే పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో లభించే పుస్తకాల కంటే 30 నుంచి 60 శాతం వరకు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కొన్ని పాఠశాలలు తమ లోగోతో పుస్తకాలు ముద్రించి అధిక ధరలకు విక్రయిస్తున్నాయని, పాత పుస్తకాలను కూడా కొత్తవిగా చూపించి అమ్ముతున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి రూ.8,000 నుంచి రూ.15,000 వరకు పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ పేరుతో అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలపై కూడా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రేపటి నుంచి అన్ని ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్లు, పుస్తకాల దందాను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రైవేట్ పాఠశాలలు విద్యను అందించే కేంద్రాలుగా ఉండాలే గానీ వ్యాపార సంస్థలుగా మారకూడదని, విద్యను లాభార్జన సాధనంగా మార్చడం సమాజానికి హానికరమని అన్నారు. తల్లిదండ్రులు కూడా మేల్కొని తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# బైక్ ప్రమాదంలో గాయపడిన బ్రహ్మారెడ్డి

**పరామర్శించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు...**

**బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన**

**డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**

**కల్లూరు,మన జనప్రగతి జూన్ 14:** బైక్ ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డిని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పరామర్శిం చారు. మండలంలోని బత్తులపల్లి గ్రామంలో నివాస ముంటున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డికి కొన్ని రోజుల క్రితం బైక్ ప్రమాదం జరగగా, ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దెబ్బల సౌజన్య, ప్రధాన కార్యదర్శి షేక్ షేరా ఉద్దీన్ ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా శీలం బ్రహ్మారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను ధైర్యపరిచారు. త్వరగా కోలుకుని ప్రజా సేవలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# విద్యతోనే అన్ని రంగాల్లోనూ అందలం: మంత్రి సవిత



**● పేదల విద్యకు ప్రోత్సాహమివ్వాలన్నది నా తండ్రి ఎస్ఆర్ఆర్ ఆశయం ● ఆయన పేరు మీద ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నాం ● కూటమి రాకతో ప్రభుత్వ విద్యకు మహర్దశ : మంత్రి సవిత**

**● ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల ప్రదానం ● 84 మంది విద్యార్థులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలు ● టెన్త్‌లో 580 మార్కులు సాధించిన 26 మందికి రూ.25 వేల చొప్పున... ● ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన 59 మందికి రూ.50 వేల చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాలు**

**పెనుకొండ/శ్రీ సత్యసాయి మన జనప్రగతి జూన్ 14:-** విద్యతోనే అన్ని రంగాల్లోనూ అందలానికి చేరుకోగలమని, సామాజిక, రాజకీయ గుర్తింపూ లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదల విద్యకు ప్రోత్సాహిస్తున్నామన్నారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతోనే అన్ని విధాలా గుర్తింపు లభించడమే కాకుండా పేదరికాన్ని సులభంగా అధిగమించొచ్చునన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి పేరు మీద ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ స్థాపించి విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ప్రోత్సాహమిస్తున్నామన్నారు. ఏటా ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు మార్కులే ముఖ్యం కాదని, నైతిక విలువలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. కురుబలు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. **ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యుత్తమ బోధన** రా.ష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యా రంగం గాడిన పడిందని మంత్రి సవిత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాణులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నారన్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎందరు విద్యార్థులుంటే అందరికీ రూ.15 వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఎంజేపీ గురుకులాల్లో చదివే విద్యార్థులకు విద్యా బోధనతో పాటు క్రీడల్లోనూ రాణించేలా స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ షూట్లు కూడా ఇస్తున్నామన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేశ్ వంద రోజుల ప్రణాళికతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల కంటే అత్యధిక ఫలితాలు సాధించారనన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో రక్షణతో కూడిన అత్యుత్తమ బోధన అందిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. **84 మంది విద్యార్థులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలు** తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా రాయలసీమకు చెందిన 84 మంది కురుబ, కురుమ, కురవ విద్యార్థులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలకు మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదవి, టెన్త్ లో 580 మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.25 వేల చొప్పున రూ. 6.50 లక్షల నగదు పురస్కారాల అందజేశారు. ఇంటర్ లో 950 మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులకు రూ. 50 వేల చొప్పున రూ.29.50 లక్షలు అందజేశారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు ల్యాప్ ట్యాప్ లు కూడా అందజేస్తున్నామన్నారు. తన తండ్రికి విద్య అంటే ఎంతో మక్కువని, అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని భావించేవారని, అందుకే ఆయన పేరు మీద చదువులో రాణించే పేద విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు తల్లిదండ్రులు దైవ స్వరూపాలని పేర్కొంటూ, విద్యార్థులతో మంత్రోచ్చరణాల తమను కన్నవారి కాళ్లు కడిగించారు. మంత్రి సవితను కురబ సామాజిక వర్గీయులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రతిభ పురస్కారాల ప్రదానం అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి సవిత భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర కురబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, విద్యార్థులు, వారి తల్లింద్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంక్రిమెంట్ జీతాల వివాదంతో ఎస్.ఎం.ఎస్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం..!

**● ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఎస్ఎంఎస్ ఫోర్‌మన్**

**● సహచర కార్మికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం**

**● ఇంక్రిమెంట్లు,వేతన సమస్యలపై కార్మికుల్లో ఆందోళన**

**వేముల మన జనప్రగతి జూన్ 14:-**వేముల మండల పరిధిలోని స్థానిక తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్)కు అనుబంధంగా పనిచేస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీలో ఇంక్రిమెంట్ జీతాల వివాదం నేపథ్యంలో ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.అయితే సహచర కార్మికుల సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది.లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన వెన్నపూస విష్ణువర్ధన్ రెడ్డి ఎస్ఎంఎస్ కంపెనీలో ఫోర్‌మన్‌గా పనిచేస్తున్నారు.ఇటీవల జీతాల ఇంక్రిమెంట్లు,వేతనాల సవరణ,ఉద్యోగ సంబంధిత సమస్యలపై ఆయన తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సహచర కార్మికులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సి షిఫ్ట్ కు డ్యూటీకి హాజరైన విష్ణువర్ధన్ రెడ్డి తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం.ఈ విషయాన్ని గుర్తించిన తోటి కార్మికులు వెంటనే స్పందించి ఆయనను అడ్డుకుని,నీళ్లు చల్లి ప్రమాదాన్ని నివారించారు.అనంతరం పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి ఉద్యోగికి ధైర్యం చెప్పినట్లు తెలిసింది.ఇంక్రిమెంట్ జీతాల అంశం,కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం వంటి కారణాలే ఈ ఘటనకు దారితీసి ఉండవచ్చన్న అభిప్రాయాలు కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఘటనపై సంస్థ అధికారులు విచారణ చేపట్టగా,పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ ఘటనతో కార్మికుల సమస్యలను యాజమాన్యం సానుకూలంగా పరిష్కరించి,ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి: పాలడుగు భాస్కర్




**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 14:-** తెలంగాణ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు.సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఫసియోద్దీన్ అధ్యక్షతన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 28 నెలలు అవుతున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. 01-07-2023 నుండి రావలసిన 2వ పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించి అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి. రిటైర్డ్, సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే క్లియర్ చేయాలి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, ఎన్నికల హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని (OPS) అమలు చేయాలి.రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం వల్ల ఆర్థిక బాధలు తట్టుకోలేక విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొండేటి సోమిరెడ్డి గుండెపోటుతో మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాదానాయక్ ప్రసంగించారు. అలాగే రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కవిత, సుధాకర్, నవీన్ కుమార్, విజయ వర్ధనరాజు, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## చల్లా ఇంట సంబరాలు..చిన్నారి జగతీకి తొలి పుట్టినరోజు వేడుకలు

**● ఆశీర్వదించిన వైఎస్సార్‌సీపీ నాయకులు,ప్రజాప్రతినిధులు**

**● బచ్చయ్యగారిపల్లిలో ఘనంగా నిర్వహించిన జన్మదిన వేడుకలు**






**వేముల మన జనప్రగతి జూన్ 14:-** వేముల మండల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణల చిన్న మనవరాలు, కడప జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యనిర్వాహక సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్ - గౌతమి దంపతుల చిన్న కుమార్తె చల్లా జగతీ తొలి జన్మదిన వేడుకలు ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని బచ్చయ్యగారిపల్లి గ్రామంలోని వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, అభిమానులు చిన్నారి జగతీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేయించి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.చిన్నారి ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆశీర్వదించారు.జన్మదిన వేడుకలకు హాజరైన రాజకీయ నాయకులు,ప్రజాప్రతినిధులు,శ్రేయోభిలాషులు చల్లా కుటుంబ సభ్యులను అభినందించారు.అలాగే సోషల్ మీడియా వేదికగా కూడా పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి,మాజీ ఏ.ఎస్.పి ఖలీల్ సౌధాగర్,ఆంధ్రప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంతరాయుడు,గౌరవ అధ్యక్షుడు చిన్న ఆంజనేయులు,యువ నాయకులు నాగేళ్ల పవన్ విశ్వేశ్వర్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి,వైస్ ఎంపీపీ మల్ రెడ్డి,ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర రెడ్డి, వెంకట రమిరెడ్డి,శ్రీనివాసులు,కో-ఆప్షన్ సభ్యుడు మండి మా పీరా,సుబ్బారెడ్డి,రాఘవ రెడ్డి,చిన్న సుబ్బారెడ్డి,గంగాధర్ యాదవ్,నాగప్ప తదితరులు పాల్గొని చిన్నారి జగతీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో ఘనంగా "కాన్‌ఫ్లూయెన్స్ అలుమ్ని మీట్2026"




**గుంతపల్లి, మన జనప్రగతి జూన్ 14:-** అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కాన్‌ఫ్లూయెన్స్ అలుమ్ని మీట్2026" కార్యక్రమం ఆదివారం గుంతపల్లి లోని అవంతి ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. పలువురు ప్రముఖులు, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల్లో అలుమ్ని పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సి. కృష్ణమోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ ఓ.బి.వి. రామనయ్య మాట్లాడుతూ, విద్య అనేది ఉద్యోగ సాధనకే కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అవంతి పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. యోకోగావా ఇండియా లిమిటెడ్, ట్రాన్స్‌యూనియన్, ఎవోక్ టెక్నాలజీస్, హెటెరో హెల్త్‌కేర్, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఐటీ మరియు ఇతర కార్పొరేట్ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అలుమ్నీలు తమ విజయగాథలను వివరించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఛైర్మన్ శ్రీ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా అవంతి సంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చాయని తెలిపారు. అలుమ్ని నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు ఉద్యోగ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఐ. శ్రవణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎం.వి.ఎస్.ఎస్. నందీశ్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద కార్యక్రమంలో పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హెచ్.వి. శేష తల్ప సాయి, అవంతి సైంటిఫిక్ టెక్నలాజికల్ అండ్ రీసెర్చ్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉమాపతి రెడ్డి, అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజ్ కమల్, క్యాంపస్ ఇన్‌చార్జ్ బోస్ బాబు, పీఆర్‌ఓ శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలుమ్ని మీట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల అనుభవాల పంచిక, అవార్డుల ప్రదానం, విద్యార్థులతో పరస్పర చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం చివర్లో అతిథులు, పూర్వ విద్యార్థులు , నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో అలుమ్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని యాజమాన్యం వెల్లడించింది. అవంతి కుటుంబ బంధాన్ని మరింత బలోపేతం చేసిన ఈ అలుమ్ని మీట్ విజయవంతంగా ముగిసింది.




PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174